జిల్లా పోలీసు శాఖకు స్కాచ్ అవార్డు: ఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసులు చేపట్టిన సంకల్పం కార్యక్రమానికి ప్రతిష్ఠాత్మక స్కాచ్ అవార్డు లభించినట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. క్షేత్రస్థాయిలో వచ్చిన మార్పులను కమిటీ సభ్యులు పరిశీలించి అవార్డుకి ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పోలీసులు డ్రగ్స్ నియంత్రణకు చేపడుతున్న చర్యలను కూడా వారు పరిశీలించారని, చివరకు విజయనగరం జిల్లా పోలీసుల కృషికి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.



- నిరాశలో భూ యాజమాన్య హక్కులు పొందిన రైతులు
- ఫ్రీహోల్డ్ భూముల్లో రిజిస్ట్రేషన్లకు నోచాన్స్
- మరో రెండు నెలలు గడువు పొడిగింపు
- విచారణ పూర్తికాకే ఈ నిర్ణయం
- జిల్లాలో 7490.62 ఎకరాలపై శాశ్వత భూ హక్కు

ఎస్.కోట: యాజమాన్య హక్కు పొందిన అసైన్డ్ భూమి

భూమున్నా.. అమ్ముకోలేక!

వేపాడ మండలం కొండగంగుబూడి గ్రామానికి చెందిన ఓ గిరిజన మహిళా రైతుకు చెందిన 1.06 ఎకరాల అసైన్డ్ భూమికి గత వైసీపీ ప్రభుత్వం శాశ్వత భూ హక్కును(ఫ్రీహోల్డ్) కల్పించింది. దీంతో ఆమె మంచి ధర కోసం ఎదురుచూసింది. ఇంతలో ప్రభుత్వం మారింది. అసైన్డ్ భూములకు శాశ్వత భూహక్కులను కల్పించే పేరుతో వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగానికి పాల్పడిందంటూ కూటమి ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూములపై విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో భూమి అమ్మడానికి అవకాశం లేక, అవసరాలకు చేతిలో డబ్బులు లేక ఆమె ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఇలా జిల్లాలో అసైన్డ్ భూములపై శాశ్వత హక్కులు పొందిన ఎంతో మంది రైతులు వీటిని విక్రయించుకొనే అవకాశం లేక నేటికీ అవస్థలు పడుతున్నారు.

శృంగవరపుకోట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ భూముల్లో రిజిస్ట్రేషన్లు జరగకుండా విధించిన గడువును కూటమి ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. రెవెన్యూ అధికారుల విచారణ పూర్తి కాకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 7490.62 ఎకరాల అసైన్డ్ భూములపై గత ప్రభుత్వం శాశ్వత భూ హక్కులను (ఫ్రీహోల్డ్) కల్పించింది. కాగా రామభద్రపురంలో 33.88 ఎకరాలు, దత్తిరాజేరు 0.36 ఎకరాలు, గజపతినగరం 6.11 ఎకరాలు, మెరకముడదాం ఒక ఎకరా, భోగాపురం 19.6, డెంకాడ 5.1 ఎకరాలు, విజయనగరం 11.56 ఎకరాలు, గంట్యాడ 1.25 ఎకరాలు, వేపాడ 100.55 ఎకరాలు కలిపి మొత్తం 179.41 ఎకరాల్లో చాలా వేగంగా రిజిస్ట్రేషన్‌లు చేసేసారు. ఈ భూముల రిజిస్ట్రేషన్లు జరిగిన మరుక్షణమే రెవెన్యూ అధికారులు వెబ్‌ల్యాండ్‌లోనూ నమోదు చేసేశారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ తంతు అప్పట్లోనే పలు అనుమానాలకు తావిచ్చింది. అప్పటి ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకుల (మిగతా 6వ పేజీలో..)

అక్రమాలను నిర్ధారించిన సిసోడియా

గత ఏడాది ఆగస్టులో భూపరిపాలన, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా జిల్లాల వారీగా ఫ్రీహోల్డ్ భూముల వివరాలను పరిశీలించారు. ఇందులో భాగంగా జిల్లాకు ఆగస్టు 16న వచ్చారు. జిల్లాలో అత్యధికంగా ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ జరిగిన శృంగవరపుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అవినీతి, అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. అప్పటి సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలూ తీసుకున్నారు. అయితే రెవెన్యూ అధికారులు చేసిన తప్పులను మాత్రం ఇంతవరకు గుర్తించలేకపోయారు. ఫ్రీహోల్డ్‌లో జరిగిన అవకతవకలను తేల్చలేకపోయారు.

నెలకు రూ.3 లక్షల జీతం

- జర్మనీలో ఉద్యోగం కల్పిస్తాం.. శిక్షణకు రండి
- జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్



రామభద్రపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ చేసిన నిరుద్యోగులకు జర్మనీ లాంగ్వేజ్ నేర్పించి, ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చి, వీసాలు కూడా ఇప్పించి జర్మనీలో నెలకు సుమారు రూ.3లక్షల జీతం ఇచ్చే ఉద్యోగాలు కల్పిస్తామని జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో ప్రైవేటు రంగంలో 2 వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. ప్రస్తుతం నిరుద్యోగ యువతకు కంప్యూటర్, టైలరింగ్, సర్వేయర్, ఏసీ టెక్నీషియన్స్, ప్లంబింగ్, ఫాబ్రికేటెడ్ వంటి రంగాల్లో 3 వేల మందికి మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇంజనీరింగ్, డిప్లమో తదితర రంగాల్లో చదివిన నిరుద్యోగ యువతకు ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి వీరికి కూడా జర్మనీలో ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ నంబర్ 9988853335కు సంప్రదించాలని కోరారు.

హోలీ.. రంగుల కేళీ

7

హోలీ పండుగను అన్ని వర్గాలు కలిసి జాలీగా చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రంగులను చల్లుకుంటూ.. ఒంటికి పూసుకుంటూ.. ఒకరినొకరు ఆట పట్టించడంలో ఆబాలగోపాలం మునిగితేలుతుంటారు. అయితే రంగుల్లో రసాయన మిశ్రమాలు ఉండడంతో ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితిలో సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. తలపై, ఇతర ప్రదేశాల్లో కోడిగుడ్లతో కొట్టడం, బురద నీరు చల్లడం వంటివి చేయకూడదంటున్నారు.



ఆ కౌన్సిలర్లు గైర్హాజరు

- శంబంగి నిర్వహించిన సమావేశానికి హాజరు కాని వైనం
- మునిసిపాల్టీలో అవిశ్వాస తీర్మానంపై సర్వత్రా పెరిగిన అనుమానాలు



బొబ్బిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావుపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు, టీడీపీ కౌన్సిలర్లు సన్నద్ధమవుతున్న తరుణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు గురువారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా రహస్య సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి సగం మంది సొంతపార్టీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చేందుకు తొమ్మిది మంది వైసీపీ కౌన్సిలర్లు సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. ఆ తొమ్మిది మంది శంబంగి నిర్వహించిన సమావేశానికి హాజరుకాలేదు. ఈ నెల 17 కల్లా మున్సిపల్ పాలకవర్గానికి నాలుగేళ్ల పదవీకాలం పూర్తవుతుంది. 18 తర్వాత అవిశ్వాస తీర్మానాలకు నోటీసులు ఇవ్వొచ్చు. బొబ్బిలి మున్సిపాలిటీలో ఇందుకోసం జోరుగా పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో శంబంగి నిర్వహించిన సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. గైర్హాజరైన తొమ్మిది మంది శంబంగికి సంజాయిషీ ఇచ్చినట్లు తెలిసింది. కొంతమంది ఇంటికి వచ్చి స్వయంగా కలుస్తామని, ఇంకొంతమంది ఆరోగ్య సమస్యలున్నాయని, అర్జంటుగా క్యాంపులు వెళ్లామని చెప్పారు. అధికార తెలుగుదేశం పార్టీ వ్యూహం ఏమిటో బయటపడిన తరువాత అవసరమైన నిర్ణయాలు తీసుకుందామని చైర్మన్, ఇతర కౌన్సిలర్లకు శంబంగి నచ్చజెప్పినట్లు తెలిసింది.

మహిళా ఎస్ఐ దేవిపై దాడి పట్ల హోంమంత్రి అనిత ఆగ్రహం

7



ఆయుధ డిపో ప్రతిపాదిత స్థలం

స్థల పరిశీలనలో అధికారుల బృందం(ఫైల్)

బాడంగిలోనే ఆయుధ డిపో

- ఎయిర్ స్ట్రిప్‌ను వాడుకునేందుకు నిర్ణయం
- నావికాదళం ఉన్నతాధికారులు గ్రీన్‌సిగ్నల్

విజయనగరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేవీ కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాలో ఆయుధ డిపో ఏర్పాటుకు అంగీకరించింది. బాడంగిలోని ఎయిర్ స్ట్రిప్‌ను డిపోగా మార్చాలని నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం. బ్రిటీష్ కాలంలో రక్షణ అవసరాలకు బాడంగి ఎయిర్‌స్ట్రిప్‌ను వినియోగించేవారు. రెండో ప్రపంచ యుద్ధం ఎయిర్‌బేస్‌గా దీనిని పరిగణిస్తున్నారు. తాజాగా పునర్నిర్మించాలనుకుంటున్నారు. అదే జరిగితే జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్టే. వారం కిందట నావికాదళ జూనియర్ మేనేజర్, వర్క్‌సెక్షన్ ఆఫీసర్ ఆదిత్య, ఆర్డీవో రామ్మోహనరావుతో కలిసి ఆ భూములను పరిశీలించారు.

బాడంగి ఎయిర్ స్ట్రిప్‌నకు సుదీర్ఘ చరిత్ర ఉంది. దీనిని బ్రిటీష్ కాలంలో ఏర్పాటుచేశారు. అప్పట్లో యుద్ధ అవసరాలు, సరుకుల రవాణాకుగాను 227 ఎకరాల్లో రన్‌వే, ఏటీసీ, బంకర్లను సైతం నిర్మించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఈ ఎయిర్‌స్ట్రిప్ కీలక భూమిక వహించినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో సూపర్ మెరైన్ స్పిట్, ఫైర్ ఫైటర్స్, హాకర్ హరికేన్, ఫైటర్స్ బాంబర్లు, బీ-57 కాన్‌బెర్రా వంటి యుద్ధవిమానాలు ఇక్కడ ఉండేవి. కానీ ఎందుకో 1946లో ఇక్కడి ఎయిర్ స్ట్రిప్‌ను మూసివేశారు. అటు తరువాత ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ భూమిని స్వాధీనం చేసుకుంది. కొంతకాలం పాటు వరి, గోధుమ నిల్వలను ఇక్కడ స్టాక్ చేసేవారు. తరువాత ఈ భూమి రైతుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఈ భూముల్లో పంటలు పండిస్తున్నారు.

అక్కడే అనుకూలం..

జిల్లాలో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మితమవుతున్న నేపథ్యంలో జిల్లాపై నేవీ ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. జాతీయ రహదారి, రైల్వేలైన్ కూడా దగ్గరగా ఉండడంతో బాడంగిలో ఆయుధ డిపో ఏర్పాటుచేస్తే బాగుంటుందని నేవీ ఉన్నతాధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. కొద్దిరోజుల కిందట ఎన్‌సీఏ, నేవీ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. జిల్లా అధికారులతో పాటు రెవెన్యూ శాఖ అధికారులతో క్షుణ్ణంగా చర్చించారు. నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు (మిగతా 6వ పేజీలో..)



మామిడి పిందెలకు కవర్లను కట్టిన దృశ్యం

మామిడి సంరక్షణలోనే..

- ఉన్న పంటను కాపాడుకునే పనిలో రైతులు
- పూత, పిందె నేలపాలవుతున్న వైనం
- పొగ, తేనెమంచు కారణం

బొబ్బిలి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మామిడి ఫలాలు అందరికీ విరివిగా అందుబాటులోకి వస్తాయా? అంటే కష్టమేనని రైతులంటున్నారు. ఎప్పటిలా డిసెంబరు, జనవరి నుంచి మామిడి పూత మొదలైనప్పటికీ అది నిలదొక్కుకోవడమే కష్టంగా మారింది. పొగమంచు, తేనెమంచు విపరీతంగా కురవడంతో పూత రాలిపోతోంది. కాసిన పిందెలలో రెండొంతులకు పైగా నేలరాలిపోయాయి. కళ్లెదుటే నేలపాలవుతుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పిందె కట్టే దశలో ఉన్న మామిడి పంటను ఎలా కాపాడుకోవాలోనని సతమతమవుతున్నారు.

- మంచుకు ఎక్కువగా కురవడంతో తేనెమంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు, ఆకుమచ్చ తెగులు వంటివి పంటలను ఆశించాయి. ఈ తరుణంలో మందులు పిచికారీ చేయడం చాలా అవసరం. నీటిని సమృద్ధిగా అందివ్వాల్సి ఉంటుంది. తద్వారా ఆ కాస్త పంట అయినా దిగుబడి వచ్చే అవకాశం ఉంది.
- మామిడి పంటను కాపాడుకునేందుకు రైతులందరికీ సూచనలు ఇస్తున్నామని బొబ్బిలి ఉద్యానశాఖాధికారి ఎస్.వెంకటరత్నం తెలిపారు. సమస్య ఉన్న రైతులు నేరుగా అధికారులను కలవాలని కోరారు. అధికారి సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని, పంటకు తడిని అందిస్తే పిందె రాలడం తగ్గి దిగుబడి పెరిగేందుకు దోహదపడుతుందన్నారు.

మామిడి పంటకు నష్టమే

ఈ ఏడాది మామిడి చెట్లకు పూత అంతంతమాత్రంగానే పూసింది. దానిపై మంచు కురవడంతో 60 నుంచి 70 శాతానికి పైగా పూత నేల రాలిపోయింది. బోర్లు ఉన్న ప్రాంతాలలో కొంతమేర రైతులు నీటిని తోటలకు అందిస్తున్నారు. తద్వారా ఉన్న పంటను కాపాడుకోవాలని భావిస్తున్నారు.

- తూముల శ్రీనివాసరావు, మామిడి రైతు, బొబ్బిలి



శక్తి బృందాలకు సూచనలు ఇస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ఆకతాయిల భరతం పడదాం: ఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలపై దాడులు, వేధింపులను నిరోధించేందుకు ఆకతాయిల భరతం పడదామని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. శక్తి టీమ్స్‌తో గురువారం ప్రత్యేకంగా సమావేశమై సూచనలు ఇచ్చారు. విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ టీమ్స్ జిల్లాలో ఏర్పాటు చేశామని, కళాశాలలు, ముఖ్య కూడళ్లలో మఫ్టీలో తిరుగుతూ ఆకతాయిలను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి పట్టణాల్లో శక్తి టీమ్స్ పనిచేస్తాయని తెలిపారు. యాప్ పట్ల తొలుత ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి వారి మొబైల్స్‌లో యాప్‌ను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. శక్తి టీమ్స్ పనితీరును డీజీపీ కార్యాలయం పర్యవేక్షిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ సౌమ్యలత, సీఐ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకై.. తాగు నీరు వృథా

●బొబ్బిలిలో తరచూ పైపులైన్లు పాడవుతున్న వైనం



రైల్వేస్టేషన్ సమీపంలో పైపులైన్ లీక్‌కావడంతో వృథాగా పోతున్న నీరు

బొబ్బిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం తాగునీటి పైపులైన్‌లీకుకావడంతో తాగు నీరు వృథాగా పోయింది. ఈ పైపులైన్ ద్వారా మునిసిపాలిటీ పరిధిలో సుమారు ఐదు వేల మందికి నిత్యం తాగునీరందుతోంది. ఈ మార్గంలో నిత్యం ఏదో ఒక చోట పైపులైన్ లీకువుతున్న విషయం విదితమే. అయితే మునిసిపల్ నీటి విభాగం అధికారులు తరచూ పైపులైన్లు పాడవుతున్నా చర్యలు తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. తక్షణమే పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించి నీరు వృథాకాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ప్రైవేట్ ట్యాంకర్లతో తాగునీరు తరలింపు

●మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ అభ్యంతరం

బొబ్బిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలో మునిసిపల్ కుళాయిలకు వెళ్లాల్సిన నీటిని ప్రైవేట్ ట్యాంకర్ల తాగునీటేతర అవసరాలకు తరలించడంపై మునిసిపల్ కోఆప్షన్‌సభ్యుడు రియాజ్‌ఖాన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం బొబ్బిలిలోని పోలీసు స్టేషన్ ఎదురుగా గల మునిసిపల్ రిజర్వాయరు నుంచి ప్రైవేట్ ట్యాంకుతో నీరు తరలిస్తున్న విషయాన్ని గమనించి ఎమ్మెల్యే బేబీనాయన, కమిషనరుకు ఫిర్యాదుచేశారు. మునిసిపల్ యంత్రాంగం బాధ్యతా రహితంగా తాగునీటిని ప్రైవేట్ వ్యక్తులకు నిర్మాణ, ఇతర అవసరాలకు సరఫరా చేయడం ఏమాత్రం సబబుకాదని రియాజ్‌ఖాన్ పేర్కొన్నారు. ప్రైవేట్ ట్యాంకర్లతో నీటిని తరలించడంతో ఎంఆర్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాగాన సునీల్ కుమార్ అధికారుల తీరును తప్పుబట్టారు. కాగా స్థానిక రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టరు ఈనెల 13న వెయ్యి రూపాయల చలానా మునిసిపాలిటీకి చెల్లించి నీటిని తరలించినట్లు కమిషనరు లాలం రామలక్ష్మి తెలిపారు.ఇందులో ఎటువంటి అవకతవకలు జరగలేదని, ఇక మీదట నీటి సమృద్ధి ఆధారంగానే అత్యవసరంగా ప్రైవేట్ ట్యాంకర్లకు తగిన రుసుము వసూలు చేసి సరఫరా చేస్తామని పేర్కొన్నారు. తొలి ప్రాధాన్యతగా పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం సరఫరా చేస్తామని తెలిపారు.

పి-4 సర్వే పక్కాగా చేపట్టాలి: ఎంపీడీవో



శివడవలసలో పి-4 సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పి -4 సర్వే పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో పి.రవికుమార్ ఆదేశించారు. గురువారం మండలంలోని కొండదేవుపల్లి, శివడవలసలో జరుగుతున్న పి-4 సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పి-4 సర్వేపై ఇప్పటికే శిక్షణ నిర్వహించడంతో ఎటువంటి అనుమానాలకు తావులేకుండా జాగ్రత్తగా చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామల్లోని ప్రజలు వారి వృత్తుల రీత్యా ఉదయమే బయటకు వెళ్లి, సాయంత్రం తిరిగి వచ్చే అవకాశం ఉందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని రెండు పూటలు సర్వే చేయాలని ఆదేశించారు.ఆయన వెంట పరిపాలనా అధికారి డీవీ అప్పారావు, ఎంసీవో సుధాకర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పి.రవికుమార్ హెచ్చరించారు.గురువారం మండలంలోని పిరిడిలో పర్యటించారు. గ్రామంలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త, కాలువల్లో సిల్ట్ పేరుకుపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్లు, కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు.అనంతరం గ్రామస్థుల సహకారంతో కాలువల్లో సిల్ట్ తొలగించారు. ఆయన వెంట ఎంసీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

పీఆర్సీని తక్షణమే నియమించాలి

● 17న నిరసన కార్యక్రమాలు ● రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రామ్మూర్తి



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు

బొబ్బిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీని తక్షణమే నియమించాలని, ఐఆర్, డీఆర్ వెంటనే ప్రకటించాలని, బకాయిలన్నిటినీ పూర్తిగా క్లియర్ చేయాలని, హెల్త్ కార్డులపై వైద్యసేవలను అందించాలని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్రం ఉపాధ్యక్షుడు రౌతు రామ్మూర్తి డిమాండ్‌చేశారు. గురువారం స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంఘం ప్రతినిధుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలకు సంబంధించి ఆందోళన కార్యక్రమాలు ఈనెల 17న చేపడుతున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమానికి రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పి శాస్త్రి, జనరల్ సెక్రటరీ ఐ.లక్ష్మీనారాయణ, నాగరాజులు నాయకత్వం వహిస్తారన్నారు. అనంతరం జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు లచ్చుపతుల జగన్నాథం, పోల సత్యంనాయుడు, బొత్స సత్యనారాయణ, చుక్క శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు

కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):బీసీ, కాపు, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన మహిళా లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తులనుఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణ అనంతరం 75 శాతం హాజరు కలిగిన వారికి సర్టిఫికెట్, ఉచితంగా కుట్టుమిషన్ అందజేయనున్నట్లు తెలిపారు.

సమన్వయంతో సర్వేలు పూర్తిచేయాలి

రామభద్రపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):వివిధ సర్వేలను అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి జి.ప్రశాంత్‌కుమార్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పీ-4 సర్వేను వేగవంతం చేయాలని, మిస్సింగ్ ఎంప్లాయి సిటిజన్, వర్క్ ఫ్రంహోం తదితర సర్వేలు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ఉపాధి వేతనదారులకు పనిప్రదేశాల వద్ద సౌకర్యాలు కల్పించాలని సూచించారు. 22 పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలని కోరారు.ప్రతి శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలోభాగంగా పంచాయతీలు, ప్రభుత్వకార్య క్రమాల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నవోదయం కార్యక్రమం ద్వారా సారా నిర్మూలనకు మండల, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు క్రాష్ ప్రోగ్రాం ద్వారా బోర్లు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేల్లో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, జూనియర్ లైన్‌మెన్లు పాల్గొనలేదని ఎంపీడీవో రత్నం అసంతృప్తి వ్యక్తం చేశారు.

వసతులు లేక.. పర్యవేక్షణకు నోచుకోక

●ఒక గదిలోనే నిర్వహణ

●ఇదీ మోసూరువలస ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి

బొబ్బిలి/రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోసూరువలస ప్రాథమిక పాఠశాల కనీస వసతులకు నోచుకోకపోవడంతో గిరిజన విద్యార్థులు నాణ్యమైన విద్యకు నోచుకోలేకపోతున్నారు. ప్రధానంగా మైదాన ప్రాంతానికి దూరంగా ఉండడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద అప్పట్లో పాఠశాల రూపు రేఖలు మారుస్తామని ప్రకటించినా పనులు ముందుకుసాగలేదు.ఈ నేపథ్యంలో ఒకే గదిలో తరగతులు నిర్వహించాల్సివస్తోంది. ఇరుకు గదిలో 37 మంది విద్యార్థులు అభ్యసించేందుకు అవస్థలకు గురవుతున్నారు. దశాబ్దాల కిందట నిర్మించి పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల మరుగుదొడ్లు కూడా శిథిలావసకు చేరడంతో అటు వైపు వెళ్లడానికి విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఏ క్షణమైనా కూలిపోవచ్చని విద్యార్థులు వాపోతున్నారు. కాగా పాఠశాల మరమ్మతులు, నూతన భవన నిర్మాణానికి అధికారులకు ప్రతిపాదనలు పంపామని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకట అప్పలనాయుడు తెలిపారు.



ఒకే గదిలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

భూమున్నా.. అమ్ముకోలేక!

(5వ పేజీ తరువాయి)

సహకారంతో రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములకు శాశ్వత భూహక్కులు కల్పించారని ఆరోపణలు వచ్చాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఆ భూముల లెక్కతేల్చేందుకు సిద్ధపడింది.

వారంతా కదలకే..

జిల్లాలో ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాల్లో ఫ్రీహోల్డ్ జరిగిందో బయటపెట్టడం లేదు. ఇప్పటికీ అనేక దఫాలు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తహసీల్దార్‌లు, ఉప తహసీల్దార్‌లతో సమావేశమయ్యారు. లెక్కలు తేల్చి పంపాలని ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ లెక్క కొలిక్కిరానట్లు తెలుస్తోంది. దీనికి కారణం జిల్లాలో అప్పట్లో పని చేసిన తహసీల్దార్‌లు, ఉప తహసీల్దార్‌లు, అదే సిబ్బంది నేటికీ ఉన్నారు. తహసీల్దార్‌లను ఒక మండలం నుంచి మరో మండలానికి మార్చినప్పటికీ ఉప తహసీల్దార్‌లలో సగానికి పైబడి అప్పుడు పని చేసిన మండలాల్లోనే ఇప్పటికీ పని చేస్తున్నారు. ఆర్ఐ, వీఆర్‌వోలూ అంతే. అప్పట్లో వీరు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు చూస్తున్నారు. దీంతో ఎన్నిసార్లు ప్రభుత్వం, కలెక్టర్‌లు ఫ్రీహోల్డ్ భూముల వివరాలను సక్రమంగా ఇవ్వాలని అడిగినా పట్టించుకోవడం లేదు. పంపించిన నివేదికలనే అటు ఇటు మార్చి పంపిస్తుండడంతో లెక్క తేలడం లేదు. ప్రభుత్వం సంతృప్తి చెందడం లేదు. ప్రభుత్వమైతే ఫ్రీహోల్డ్ భూముల అవకతవకలను నిగ్గుతేల్చాలన్న పట్టుదలతో ఉంది. మంత్రివర్గ ఉప సంఘాన్ని కూడా నియమించింది. దీన్ని తేల్చేవరకు రిజిస్ట్రేషన్‌లకు అవకాశం ఇవ్వడం లేదు. ఈ పరిస్థితి వల్ల అసైన్డ్ భూముల్లో న్యాయపరంగా శాశ్వత భూ హక్కులను పొందిన చిన్న, సన్నకార రైతులు క్రయ, విక్రయాలు చేసుకోలేకపోతున్నారు. రెవెన్యూ అధికారుల తీరుతో ప్రస్తుతానికి వీరికి నష్టం జరుగుతోంది.

బాడంగిలో ఆయుధ డిపో

(5వ పేజీ తరువాయి)

సుముఖత వ్యక్తం చేశారు. అక్కడి భూములపై ఆరాతీశారు. ఎయిర్ స్ట్రిప్‌నకు చెందిన స్థలంతో పాటు అదనంగా 1700 ఎకరాల అవసరమని భావిస్తున్నారు. ఆ మేరకు ఏపీ ఉన్నతాధికారులకు ఒక నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. నావీ జనరల్ మేనేజర్ సైతం ఇక్కడ ఆయుధ డిపో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడం విశేషం.

కలిసొచ్చే అంశాలివే..

ఎయిర్ స్ట్రిప్‌నకు సంబంధించి భూములను టీ ఆకారంలో సేకరించడానికి అధికారులు సిద్ధపడుతున్నట్టు సమాచారం. ప్రధానంగా బాడంగి మండలం ముగడ, మల్లంపేట, పూడివలస, రామచంద్రపురం, కోడూరు పరిధిలో భూముల సేకరణకు రంగం సిద్ధమైనట్టు సమాచారం. తీర ప్రాంత రక్షణ నావికాదళం ప్రధాన బాధ్యత. అయితే విశాఖ కేంద్రంగా నేవీకి సంబంధించి చాలా కార్యాలయాలు ఉన్నాయి. ఆయుధాలకు సంబంధించి డిపో విశాఖ నగరానికి దూరంగా ఏర్పాటుచేయాలని భావించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో బాడంగిలోని ఎయిర్ స్ట్రిప్ భూములపై నేవీ దృష్టిసారించింది. ఇక్కడ ఆయుధ డిపో ఏర్పాటుకు అనువుగా ఉన్నట్టు నేవీ అధికారులు గుర్తించారు. మందుగుండు, క్షిపణులు, టార్పెడోలు, రసాయన ముడిసరుకుల నిల్వ, నిర్వహణ, సకాలంలో పంపిణీ అంతా నేవీ ఆయుధ డిపో చూస్తుంది. ఇక్కడికి 70 కిలోమీటర్ల దూరంలో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మితమవుతోంది. అదేవిధంగా ఒడిస్సా కూడా దగ్గరవుతుంది. జాతీయ రహదారి 7 కిలోమీటర్ల దూరంలో ఉంది. 3 కిలోమీటర్ల దూరంలో డొంకినవలస రైల్వేస్టేషన్ ఉంది. ఇదంతా అనుకూలతలేనని నేవీ అధికారులు భావిస్తున్నారు.

మహిళలు సమాజానికి సహాయంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బాడంగి, మార్చి 13(ఆంధ్ర జ్యోతి): నేటి సమాజంలో మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా ప్రాధాన్యతనిస్తూ కుటుంబానికి, సమాజానికి సహాయంగా ఉండాలని డీఎస్పీ భవ్యారెడ్డి కోరారు. గురువారం స్థానిక ఎత్తుఖానా సమీపాన గల దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాబార్డ్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం నాగార్జున, జట్టు ట్రస్టు సీఈవో డి.పారినాయుడు , ఏవో శిరీష, ఆర్ప్ సీఈవో సన్యాసిరావు, దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీ సీఈవో ఎల్.శాంతి, కేజీబీవీ ప్రిన్సిపాల్ హారిక, ఎస్ఐ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నేతలు

విజయనగరందాసన్నపేట,మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, డీఆర్వో శ్రీనివాసమూర్తిని బీజేపీ జిల్లాఅధ్యక్షుడు ఉప్పలపాటిరాజేశ్వర్మ గురువారం కలెక్టరే ట్‌లో కలిశారు.ఆయనతో పాటు బీజేపీ నాయకులు శంబర లక్ష్మీనరసింహం, రమణ ఉన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు

మెరకముడిదాం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు భారతీయ విజ్ఞాన మండలి నిర్వహించిన ఇన్‌స్పైర్ పోటీల్లో సత్తా చాటారని హెచ్‌ఎం ఆల్తి రాంబాబు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలకు చెందిన లోచర్ల ధనలక్ష్మి, దాసరి ఝాన్సీ రూపొందించిన ప్రాజెక్టులు భారతీయ విజ్ఞాన సాంకేతిక మండలి ప్రశంసలు పొందాయన్నారు.

సమగ్ర దర్యాప్తు చేపట్టండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):నగరంలోని కేటీఎం షోరూంపై పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఫోర్జరీ సంతకాలతో షోరూం సిబ్బందే ఫైనాన్స్ తీసుకుని వినియోగదారులను ఇబ్బందిపెడుతున్నారని గురువారం పలువురు బాధితులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షోరూం యాజమాన్యం సంతకాలు లేకుండా ఫైనాన్స్ డబ్బులు ఎవరికీ చెల్లించిందో తెలియకుండా వినియోగదారుల ఇళ్లకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేయడం తగదన్నారు.

రాత పరీక్షలు నిర్వహించండి

●డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ డిమాండ్



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్ఎఫ్ఐ రాస్తారోకో

విజయనగరం దాసన్నపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ ఎగ్జామ్స్‌ని తక్షణమే నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని కోట జంక్షన్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు కావస్తున్నా నిరుద్యోగుల కోసం మాట్లాడే దాఖలాలు లేవన్నారు. గతంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌జ. మంత్రులు లోకేశ్, హోం మంత్రి అనిత పర్యటనలో భాగంగా కానిస్టేబుల్స్ భర్తీ ప్రక్రియ ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ పూర్తి చేయలేదన్నారు. కార్యక్రమంలో నాగరాజు, వినోద్, రాము, భానుప్రసాద్, కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు కార్పొరేషన్ రుణాలు



మాట్లాడుతున్న గంటా వెంకటరావు

విజయనగరం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ, కాపు తదితర కార్పొరేషన్‌ల ద్వారా నిరుద్యోగ యువతకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీడీవో గంటా వెంకటరావు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి 2024-25 సంవత్సరానికి సంబంధించి 70 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. వీటికి అదనంగా జన ఔషధి కార్యాలయం ఏర్పాటుకు మరో యూనిట్ కూడా ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందన్నారు. 132 మంది మహిళలకు టైలరింగు శిక్షణ ఇచ్చి వారికి మిషన్స్ కూడా అందజేయనున్నారన్నారు. ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ రుణాల కోసం ఈనెల 22 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం ఉధృతం

విజయనగరం దాసన్నపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే, రాష్ట్రవ్యాప్తంగా పోరాటం ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్ హెచ్చరించారు. గురువారం మయూరి కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వాలు కలిసి విద్యార్థులకు సుమారు రూ. 3,680 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ పెట్టాయన్నారు. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జీవో నెంబరు 77ని రద్దు చేసి, పీజీ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేసి యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న విజయవాడలో చేపట్టనున్న విద్యార్థి నిరసన దీక్షను విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రవికుమార్, జగదీశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీవక్రియలో కిడ్నీలు కీలకం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శరీరంలోని అన్ని అవయావాల్లో కిడ్నీ కూడా అత్యంత ప్రధానమైదని అది పనిచేయకపోతే, శరీరంలోని మొత్తం అవయవాలు దెబ్బతింటాయని కిడ్నీ వైద్య నిపుణుడు డాక్టరు జాడ శ్రీకాంత్ అన్నారు. గురువారం ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్.గురుప్రసాద్ ఆధ్వర్యంలోకంటోన్మెంట్‌లోని గురజాడస్కూల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిడికెడంత కిడ్నీలు, అవి చేసే పనులు చాలా గొప్పవన్నారు. జీవక్రియలో అవి కీలకమన్నారు. జీవనశైలిలో మార్పులు, మత్తుపదార్థాల వాడకం వల్ల కిడ్నీలు పాడవుతాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.స్వరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత లేని 'పోరు' యాత్ర



మాట్లాడుతున్న బీజేవైఎం జిల్లా యువమోర్చా నాయకులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైసీపీ నేతలు చేపట్టిన యువత పోరు యాత్రకు యువతే లేరని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పిళ్లా నవీన్‌కుమార్ ఎద్దేవా చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లల్లో విద్యార్థులు, యువతకు ఎటువంటి మేలు చేయలేదని తప్పుదారి పట్టించే విధంగా వైసీపీ పాలన సాగిందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రమణ, గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే ధ్యేయం

జియ్యమ్మవలస, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయమని, ఇందుకోసం ప్రజలు సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామ చంద్రరావు పిలుపునిచ్చారు.గురువారం చినమేరంగి దళిత వాడలో నవోదయం 2.0 కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీ, రవాణా, అమ్మకాల వల్ల అనర్థాలు, విధిస్తున్న శిక్షలను వివరించారు. అనంతరం గ్రామస్థులతో నవోదయం 2.0 ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు, ఏఈఎస్ పి.జీవన్‌కిశోర్, ఎస్ఐ జె.రాజశేఖర్ పాల్గొన్నారు.

డ్రోన్లతో సారా తయారీపై నిఘా

పార్వతీపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):డ్రోన్లను ఉపయోగించి సారా తయారీ క్రేందాల సమాచారాన్ని సేకరించి, పటిష్ట నిఘా ఉంచాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కోరారు. నవోదయం 2.0 కింద సారా రహిత జిల్లాగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నవోదయం 2.0 కార్య క్రమంపై జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. నవోదయం 2.0 ప్రచార రథం ప్రారంభించారు. కరపత్రాలు, గోడపత్రికలను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 137 గ్రా మాలను ఏబీసీ గ్రామాలుగా వర్గీకరించి దత్తత అధికారులను నియమించినట్లు తెలిపారు. సారా సంబంధిత ఫిర్యాదులకోసం టోల్ ఫ్రీ నెంబర్ 14405పై విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

రెడ్డికంచేరులో పోలీస్ అవుట్‌పోస్ట్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ

● ప్రజల సౌకర్యార్థమే: ఎస్పీ వకుల్ జిందాల్

భోగాపురం, మార్చి13(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం మండలంలోని రెడ్డికంచేరులో పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. స్థానికులకు ఎయిర్ పోర్టు నిర్మాణంలో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వర్కర్స్ మధ్య విబేధాలు తలెత్తకుండా ఉండేందుకు దీన్ని ఏర్పాటు చేశామన్నారు. గురువారం ఆయన పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణం నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వర్కర్స్ వచ్చి పనులు చేస్తున్నారన్నారు. ఎయిర్‌పోర్టు వర్కర్స్ స్థానికుల మధ్య తరచూ ఘర్షణలు, వాగ్వాదాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ బీట్, పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. అయితే పోలీస్ సేవలు మరింత విస్తృతం చేయాలనే ఉద్దేశంతో జీఎంఆర్, ఎల్అండ్‌టీ సహకారంతో పెట్రోలింగ్ వాహనం, పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ గ్రూపు వైస్ ప్రెసిడెంట్ రామరాజు, సీడీవో కోటేశ్వరరావు, డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐ ఎస్వీ ప్రభాకర్, ఎస్‌బీ సీఐ ఎ.లీలారావు, ఎస్ఐ వి.పాపారావు పాల్గొన్నారు.ఎస్‌బీ సీఐ ఎ.లీలారావు, ఎస్ఐ వి.పాపారావు పాల్గొన్నారు.

మహిళా ఎస్ఐ దేవిపై దాడి పట్ల హోంమంత్రి అనిత ఆగ్రహం



విజయనగరం క్రైం/ వేపాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వల్లంపూడి పోలీసుస్టేషన్ మహిళా ఎస్ఐ దేవిపై దాడి ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో హద్దులు మీరి ప్రవర్తించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వేపాడ మండలం గుడివాడలో డాన్స్ బేబి డాన్స్ కార్యక్రమంలో నృత్యం చేస్తున్న మహిళలతో మద్యం తాగి అసభ్యంగా ప్రవర్తించడంతో ఎస్ఐ దేవి అడ్డుకుందన్నారు. దీంతో ఎస్ఐపై వారు దురుసుగా ప్రవర్తించారన్నారు. ఈ విషయమై ఎస్పీ వకుల్ జిందాల్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నానన్నారు. ఇప్పటికే తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ తనతో చెప్పారన్నారు. జాతర పేరుతో మహిళల పట్ల పోకిరి వేషాలు వేస్తే సహించబోమని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయండి

అసెంబ్లీలో మన వాణి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాం (2014-19)లో విజయనగరంలోని సారిపల్లిలో టిడ్కో ఇళ్ల కేటాయింపు జాబితా నుంచి వైసీపీ ప్రభుత్వం కొన్ని పేర్లు తొలగించిందని అసెంబ్లీలో గురువారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రస్తావించారు. దానివల్ల లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గృహ నిర్మాణంపై చేపట్టిన సమీక్షలో ఆమె టిడ్కో ఇళ్లపై మాట్లాడారు. తిరిగి వారి పేర్లను జాబితాలో చేర్చి వారికి ఇళ్లు కేటాయించాలన్నారు. లేని పక్షంలో లబ్ధిదారులు తిరిగి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే టిడ్కో గృహ సముదాయానికి వెళ్లే రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. సోనియానగర్‌లో గృహ సముదాయం వద్ద వాటర్ ట్యాంకు నిర్మించలేదననే విషయాన్ని సభలో ప్రస్తావించారు. ప్రధానంగా సారిపల్లిలోని ఎన్టీఆర్‌నగర్, కొండ వెలగాడ రోడ్డులోని సోనియానగర్‌లోని టిడ్కో గృహ సముదాయాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించి, సంబంధిత లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

హోలీ.. రంగుల కేళీ

● అప్రమత్తతే శ్రీరామరక్ష
● రసాయనాలతో ప్రమాదం
● ప్రకృతి సిద్ధ రంగులే శ్రేయస్కరం

విజయనగరం/ రింగురోడ్డు/ పార్వతీపురం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ అంటే ఆ ఆనందమే వేరు. ఆబాలగోపాలం రంగులు చల్లుకుంటారు. అయితే రంగుల్లో రసాయన మిశ్రమాలు ఉండడంతో ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశాలే అధికం. అందుకే సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో మెర్క్యూరీ సల్ఫైడ్, అల్యూమినియం బ్రోమైడ్, లెడ్ ఆక్సైడ్, కాపర్ సల్ఫైడ్ వంటి రసాయనాలను కలుపుతుంటారు. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో హానికరం. అవి కంట్లో పడితే చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.

సహజ సిద్ధమైన రంగులు శ్రేయస్కరం

హోలీలో సహజ సిద్ధమైన రంగులు వాడడం చాలా ముఖ్యం. ప్రకృతి ప్రసాదించిన పువ్వులు, ఆకులతో తయారయ్యే రంగులను వినియోగించడం ఉత్తమం. ముఖ్యంగా మోదుగ, గోగుపువ్వులను నీటిలో మరిగిస్తే కాషాయం రంగు వస్తుంది. బీట్‌రూట్, పసుపు , గోరింటాకు, మందార, గులాబీ, మొక్కజొన్న పిండి, నారింజ తొక్కలతో సహజసిద్ధంగా రంగులు తయారు చేసుకోవచ్చు. ఇటువంటి రంగులను చల్లుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు.

జాగ్రత్త సుమా

హోలీ రోజు మత్తు పదార్థాలు తీసుకోవడం అవాంఛనీయ ఘటనలకు దారి తీయవచ్చు. తలపై, ఇతర ప్రదేశాల్లో కోడిగుడ్లతో కొట్టడం, బురద నీరు చల్లడం వంటివి చేయకూడదు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు వీలైనంత వరకూ రంగుల వేడుకలకు దూరం గా ఉండడం మంచిది. రంగులు పూసుకోవడం, వారిపై చల్లడం ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.



ఇలా చేస్తే మేలు

హోలీ ఆడడానికి ముందే గోళ్లకు దట్టంగా నెయిల్ పాలిష్ వేయాలి. దీనివల్ల గోళ్లలోకి రంగుల ప్రభావం పోకుండా ఉంటుంది. కొబ్బరి నూనె, ఆముదం, ఆలివ్ ఆయిల్ చెంచా చొప్పున తీసుకొని అందులో గోళ్లను ముంచి కాసేపు ఉంచాలి. హోలీ రంగులతో ఎక్కువగా నష్టం జరిగేది జుత్తుకు. ముందు రోజు రాత్రే నూనె పట్టించి మర్దన చేసుకోవాలి. మహిళలు ఉదయం గట్టిగా జడ వేసుకుంటే రంగుపడినా జుత్తుకు ఏమీ కాదు. హోలీ ముందురోజు శరీరమంతా ఆముదం రాసుకోవాలి. దాని వల్ల రంగుల ప్రభావం చర్మం లోపలికి వెళ్లదు. రంగులు తొందరగా తొలగిపోతాయి కూడా. హోలీ తరువాత ముల్తాన్ మట్టి ప్యాక్‌ను తీసుకొని రాయడం వల్ల రంగులు తొలగిపోతాయి.

నయనం ప్రధానం

కళ్లను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలి. రసాయన రంగులు పడి కళ్లకు ఇబ్బందులు రావచ్చు. అందుకే హోలీ ఆడుతున్న సమయంలో తరచూ ముఖం కడుగుకోవాలి. రోజ్ వాటర్‌తో కడుగుకుంటే కళ్లకు మంచి జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. కళ్ల చుట్టూ ఉన్న చర్మం చాలా తేలిగ్గా ఉంటుంది. వీటిపై రంగులు పడితే కమిలిపోతాయి. అందుకే హోలీ ఆడే ముందు కళ్ల చుట్టూ కొబ్బరి, బాదం నూనె రాసుకోవడం మంచిది. కళ్లు ఎర్రబడడం, నీరుకారడం, పుసులు కట్టడం, దురద, రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. తక్షణం వైద్యనిపుణులను సంప్రదించడం శ్రేయస్కరం.

హానికర రంగులతో చర్మ సమస్యలు



హోలీ రంగుల్లో డీజిల్, ఇంజిన్ ఆయిల్, గ్లాస్ పౌడర్, యాసిడ్, ఆల్కలీ, అల్యూమినియం బ్రోమైడ్, కాపర్ సల్ఫేట్, కాల్షియం, క్రోమియం, లెడ్ ఆక్సైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నారు. ఇటువంటి రసాయన రంగులు శరీరంపై పూసుకోవటం వల్ల చర్మ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చర్మం ఎర్రగా మారటం, మంట, రాషెస్, ఎర్రటి దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది. ఈ రసాయన రంగులు నీటితో కలిసి భూమిలో ఇంకిపోతే పర్యవరణం దెబ్బతింటుంది. చర్మం ఎర్రగా మారితే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

- డాక్టర్ చండీ ప్రియ, చర్మవ్యాధి నిపుణులు

కంటికి ప్రమాదం..



హోలీ పండగ సందర్భంగా విపరీతంగా వినియోగిస్తున్న రసాయనాలు కలిసిన రంగులతో ప్రమాదం ఉంది. కళ్లల్లోకి రసాయనాలు కలిసిన రంగుపడితే ముందుగా పరిశుభ్రమైన నీటితో కడగాలి. అనంతరం కంటి వైద్యులను సంప్రదించాలి. హానికర రసాయనాలు కలిపిన రంగుల వినియోగం వల్ల కంటిచూపు పోయే అవకాశం ఉంది. కళ్లు ఎర్రగా మారినా, కళ్ల నుంచి నీరు కారినా వైద్యులను సంప్రదించాలి.

- మంచు కుమార స్వామి, కంటి వైద్య నిపుణులు

పోలిపల్లి పైడితల్లి హుండీ ఆదాయం రూ.26.60 లక్షలు

రాజాం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి వివిధ మార్గాల ద్వారా రూ.26,60,714 ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈవో మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది కన్నా రూ.4 లక్షలు అదనంగా ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఏడాది జాతర సందర్భంగా ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.3,88,850, మొక్కుబడుల ద్వారా రూ.2,66,700, శీఘ్ర దర్శనం ద్వారా రూ.3,05,000, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.2,21,760, పులిహోర ప్రసాదం ద్వారా రూ.1,31,900, హుండీల ద్వారా రూ.12,85,646, విరాళాల ద్వారా రూ.60,858 ఆదాయం సమకూరిందని ఈవో వివరించారు.

రూ.1.23 కోట్ల పన్ను వసూలు

నెల్లిమర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో ఈనెల 13 నాటికి రూ.1.23 కోట్లు పన్ను వసూలు చేసినట్టు కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలో ప్రైవేటు ప్రాపర్టీలకు సంబంధించి ఆస్తి పన్ను రూ.1.48 కోట్లు డిమాండ్ కాగా ఇంకా రూ.25 లక్షలు బకాయి ఉందన్నారు. ఈ నెలాఖరిలోగా పన్ను బకాయిలను చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

ఖాళీ స్థలాలకు పన్ను చెల్లింపు

విజయనగరం రింగురోడ్డు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ డెవలపింగ్ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖాళీ స్థలాలకు సంబంధించి పన్ను రూ.32.85 లక్షలు చెల్లించింది. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును కమిషనర్ నల్లనయ్యకు ఆ సంస్థ ప్రతినిధి చెక్కు రూపంలో గురువారం అందజేశారు.

రేపు జాబ్ మేళా

విజయనగరం రింగురోడ్డు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహారాజా డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రసన్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు నైపుణ్యం.ఏపీ జీవోవీ. ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత అడ్మిట్ కార్డుతో పాటుగా ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు, పాస్‌పోర్టుసైజు ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 8099461303, 9988853335 సంప్రదించాలని కోరారు.

భవిష్యత్తులో డ్రోన్లే కీలకం

నెల్లిమర్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో డ్రోన్లు కీలకపాత్ర పోషించనున్నాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో డీన్ ప్రొఫెసర్ జె.అనిల్‌కుమార్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, సెంచూరియన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న వింగ్స్ ఆఫ్ ఇన్నోవేషన్ ఎంపవరింగ్ స్కిల్స్ త్రూ డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్ ముగింపు సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, డాక్టర్ బొంతు కోటయ్య, డాక్టర్ కె.లత, డాక్టర్ ప్రేమ చటర్జీ, డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, డాక్టర్ ఎం.జి.నాయుడు, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉనికి కోసమే వైసీపీ ఉద్యమాలు


మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఉనికి కోల్పోకుండా ఉండటం కోసమే వైసీపీ నాయకులు ధర్నాలు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేయడంతో పాటు డిగ్రీ విద్యార్థులకు బకాయిలు పెట్టిన ఘనత వారిదేనన్నారు. వారే మళ్లీ రోడ్డెక్కడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పటి బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లిస్తున్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఐదేళ్లూ ప్రచార ఆర్భాటం తప్ప ఆ పార్టీ చేసేందేమీ లేదన్నారు. పార్టీని ప్రజలు మరిచిపోతారన్న భయంతోనే వైసీపీ నాయకులు ఏదో సాకు చూపించి రోడ్డెక్కుతున్నారని నాగార్జున విమర్శించారు.

మే నెలాఖరుకు చీపురుపల్లి ఆర్వోబీ పూర్తి

● బీజేపీ నాయకుడికి రైల్వే అధికారుల లేఖ


లేఖను చూపిస్తున్న శ్రీనివాసరావు

చీపురుపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఆర్వోబీ పూర్తి స్థాయిలో 2025 మే నెలాఖరుకు అందుబాటులోకి రానున్నదని బీజేపీ జిల్లా కో-కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు రైల్వే అధికారులు తనకు లేఖ రాసినట్టు వెల్లడించారు. లేఖను ఆయన గురువారం చీపురుపల్లిలో విలేకరులకు చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి చీపురుపల్లి ఆర్వోబీ సమస్యను వివరించానన్నారు. ఆయన స్పందించి, తక్షణమే విశాఖపట్నం రైల్వే డీఆర్ఎంతో మాట్లాడారన్నారు. దీనికి స్పందించిన రైల్వే అధికారులు తనకు లేఖ రాశారన్నారు.

విద్యతోనే జీవితాల్లో వెలుగు: డీఎస్పీ

మెంటాడ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి అన్నారు. వాటివల్ల సామాజిక అశాంతి ఏర్పడుతుందన్నారు. గురువారం పనుకువానివలసలో ఆమె పర్యటించారు. విద్య జీవితంలో వెలుగులు నింపుతుందన్నారు. జనవిజ్ఞాన వేదిక కృషిని డీఎస్పీ అభినందిచారు. కార్యక్రమంలో గజపతినగరం సీఐ వెంకటరమణ, ఆంధ్ర ఎస్ఐ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో ఆధ్యాత్మిక శోభ



సంతకవిటి, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మామిడిపల్లిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో నిర్మించిన కనక దుర్గాదేవి ఆలయ ప్రారంభోత్సవాలు గురువారం మొదలయ్యాయి. తొలిరోజు మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ముర్రాటలతో మహిళల ఊరేగింపు

ముత్యాలమ్మకు వెండి కిరీటం, బంగారు నేత్రాలు


పూజల్లో ధర్మవరపు కుటుంబ సభ్యులు

వేపాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం గ్రామ దేవత ముత్యాలమ్మతల్లికి అదే గ్రామానికి చెందిన ధర్మవరపు కుటుంబ సభ్యులు వెండి కిరీటం, బంగారు నేత్రాలను గురువారం సమర్పించారు. ధర్మవరపు వరహాలమ్మ కుమారులు సత్తిబాబు, సన్యాసిరావు ఆలయ ప్రతినిధులకు అందజేసి అమ్మవారిపై భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో అవతారం, ప్రసాద్, అంజి, బుచ్చమ్మ, జాగరపు దేముడు, గొర్రిపోటు రోహన్‌కుమార్, శివ, పైడిరాజు తదితరులున్నారు.

అలాగే మండలంలోని సోంపురం, అరిగిపాలెం జంట గ్రామాల ప్రజల ఆరధ్య దేవత ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు తీర్థాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండ్ల వేషాలు, మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం సంగిడీ రాళ్లు ఎత్తే పోటీ నిర్వహించారు. రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించారు.

● డెంకాడ: డెంకాడలో బంగారమ్మతల్లి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఎడ్లబండ్ల పరుగు పందేలు పోటీలు నిర్వహించి విజేతకు రూ.20 వేలు నగదు అందజేశారు. డెంకాడ గ్రామ పెద్దలు పాణిరాజు, ప్రదీప్‌రాజు, రొంగలి కనకసింహాచలం, పొంద్రంకి ఆదినారాయణ, పతివాడ అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కొత్తవలస, మార్చి 13 (ఆంధ్రజ్యోతి : మండలంలోని దేవాడలో గురువారం ముత్యాలమ్మకు తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలో తూర్పు మహారాజుపేట (కొండపేట) గ్రామంలో పూడమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు ఆల్తి శ్రీనివాసరావు, నడిపిన నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారి పూజల అనంతరం అన్నసమారాదన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లెంక అప్పలనాయుడు, తెలుగు యువత నాయకులు బైరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గుర్రపు పందేల పోటీ


వెంకటరమణపేటలో గుర్రపు పందేల పోటీ

శృంగవరపుకోట రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగైరమ్మపేట, వెంకటరమణపేటల్లో ఎల్లారమ్మతల్లి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణపేటలో నిర్వహించిన గుర్రపు పందేల పోటీ ఆకట్టుకుంది.

విద్యార్థులా.. పనోళ్లా..?

● విద్యార్థులతో టెన్త్ పరీక్ష కేంద్రానికి బల్లల తరలింపు ● ఉపాధ్యాయుల నిర్వాకంపై పలువురు ఆక్షేపణ

మెరకముడిదాం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల నేపథ్యంలో మెరకముడిదాంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు గురువారం ఓ ట్రాక్టర్‌పై బల్లలు తరలించడం చర్చనీయాంశమైంది. విద్యార్థులతో ఉపాధ్యాయులు పనిచేయిస్తుండటాన్ని పలువురు ఆక్షేపించారు. విద్యార్థులను పనోళ్లను చేయడంపై మండిపడ్డారు. ఈవిషయంపై సంబంధిత హెచ్‌ఎం కోట్ల ఎల్లంనాయుడు వివరణ కోరగా విద్యార్థులు బల్లలు తీసుకెళితే పెద్ద తప్పేంకాదని నిర్లక్ష్యంగా బదులిచ్చారు. ఇదే విషయంపై ఎంఈవో చంద్రశేఖర్ వివరణ కోరగా విద్యార్థులతో పనిచేయించడం తప్పు అని, విచారణ నిర్వహించి చర్యలు చేపడతామని తెలిపారు.


ట్రాక్టర్‌పై బల్లలు తీసుకెళ్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

సీతానగరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరిపివలస సమీపంలో గురువారం ద్విచక్రవాహనం, కారు ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పార్వతీపురం పట్టణంలోని అగ్రహారం వీధికి చెందిన పి.సత్యస్వరూప్ భార్య జ్యోతితో కలిసి విశాఖపట్నంలో చదువుతున్న తమ పిల్లల వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మరిపివలస సమీపంలో బొబ్బిలి నుంచి వస్తున్న కారు వీరిని ఢీకొంది. దీంతో గాయపడిన వీరిని పార్వతీపురంలోని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

సీతంపేట రూరల్,మార్చి 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిన్నగోర సమీపంలో 20లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, తరలిస్తున్న కె .అప్పలస్వామిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు దోనుబాయి ఎస్ఐ మస్తాన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వైద్యసేవలో అక్రమాలపై లోతుగా ఆరా

● నివేదిక తర్వాత చర్యలు: ఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెంటాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవలో అక్రమాలు వెలుగు చూసిన తర్వాత మరింత లోతైన విశ్లేషణతో గురువారం 'ష్..గప్‌చుప్' శీర్షికన ప్రచురితమైన కథనం వైద్య ఆరోగ్య శాఖలో మరోసారి ప్రకంపనలు సృష్టించింది. ఇంత పకడ్బందీ సమాచారం ఎలా వెళ్తోందనేది అధికార వర్గాల్లో చర్చనీయాం శంగా మారింది. కొంతమంది ఉద్యోగులకు ఫోన్ చేసిమరీ ఆరాతీసినట్టు విశ్వసనీయంగా తెలియవచ్చింది. కాగా పాలకొండలో సతీమణి ఎండీగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహిస్తున్నట్టు ఆంధ్రజ్యోతికి సమాచారం ఎవరిద్వారా వెళ్లిందని ఆ కీలక అధికారి పలువురి వద్ద ఆరా తీశారని సమాచారం. ఇది వైద్యసేవ ఉద్యోగుల పనేనని ఆయన పలువురి వద్ద చిర్రుబుర్రులాడినట్టు తెలిసింది. వారి వివరాల కోసం అన్ని మార్గాల్లో ప్రయత్నిస్తున్నారట.

నివేదిక తర్వాత చర్యలు: ఎన్టీఆర్ వైద్యసేవ ఈవో

జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలో అవినీతి అక్రమాల వ్యవహారంపై రాష్ట్ర ఈఓ ఓబుల్ నాయుడు స్పందించారు. గురువారం ఆయన ఫోన్లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఈ వ్యవహారం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వైద్యసేవ కో ఆర్డినేటర్‌ను విచారణకు ఆదేశిస్తానని చెప్పారు. వేరే అధికారితో విచారణ జరిపించి నివేదిక అనంతరం తగిన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భోగాపురం, మార్చి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సవరవల్లి, ఉప్పాడపేట, రావాడ, బసవపాలెం, తూడెం, కవులవాడ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేసామని ఏఈ మస్తాన్‌వలీ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.